
తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
సోమవారం
30 మార్చి 2026





బంజారాహిల్స్ అన్నపూర్ణ స్టూడియో లైన్‌లో అక్రమ నిర్మాణానికి సీజ్ తొలగించి తిరిగి పూర్తిస్థాయిలో చేపట్టిన కట్టడం



బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 3, ఇంటి నెంబర్ 8-2-334/11, సీజ్ తొలగించిన బిల్డింగ్



జిహెచ్ఎంసి నుండి ఎలాంటి అనుమతుల్లేకుండా పాత భవనంపై అక్రమ నిర్మాణం చేస్తుండగా సీజ్ చేసిన ఈ భవనాన్ని గంటల వ్యవధిలోనే బ్యానర్‌ను తొలగించారు

# వసూళ్ల సిస్టం ఆపకుంటే కష్టం..



జూబ్లీహిల్స్ సర్కిల్ ఇంచార్జ్ ఏసీపీ సురేష్

## అక్రమ నిర్మాణాల్లో అదే రీతి.. ఆగని అవినీతి



జూబ్లీహిల్స్ సర్కిల్ సెక్షన్ ఆఫీసర్ సాయికిరణ్

- సీజ్ చేస్తున్న పేరిట మస్తుగా డీల్
- ఖైరతాబాద్ జోన్ జూబ్లీహిల్స్ సర్కిల్-36లో బహిరంగ దందా

ఖైరతాబాద్, మార్చి 29 (జనంసాక్షి) : గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఖైరతాబాద్ జోన్ జూబ్లీహిల్స్ సర్కిల్-36లో అక్రమ నిర్మాణాలపై చర్యల పేరుతో జరుగుతున్న వసూళ్ల తంతు మరింత వెలుగులోకి వస్తోంది.ఇంచార్జ్ ఏసీపీ సురేష్ నేతృత్వంలో సీజ్ చర్యలు చేపడుతున్నప్పటికీ, అవే చర్యలు డబ్బు దందాగా మారాయని స్థానికులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. సీజ్ నోటీసులు జారీ చేసిన భవనాల వద్ద అధికారికంగా బోర్డులు ఏర్పాటు చేసి, ప్రజల కళ్ల ముందు చర్యలు తీసుకుంటున్నట్టు చూపిస్తున్న అధికారులు.. అదే సమయంలో యజమానులతో గోప్యంగా ఒప్పందాలు కుదుర్చుకుని నిర్మాణాలను కొనసాగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత 15 రోజుల క్రితం బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 3, ఇంటి నెంబర్ 8-2-334/11 సీజ్ చేసినట్టు రికార్డులో చూపించారు. గంటల వ్యవధిలోనే లావాదేవీలు కుదుర్చుకొని సీజ్ చేసిన బిల్డింగును అన్‌సీజ్ చేశారు. మళ్లీ 'సీజ్ చేస్తాం.. కూల్చేస్తాం..' అంటూ భారీ డైలాగులు వల్లెవేస్తున్నప్పటికీ అక్కడి వ్యవహారం వేరేగా మారుతోంది. ఇన్‌చార్జ్ ఏసీపీ సురేష్‌తో పాటు సెక్షన్ ఆఫీసర్ సాయి కిరణ్ కూడా ఈ వ్యవహారంలో భాగస్వాములుగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. 'ఎవరికి ఎంత' అన్న విధంగా అక్రమ నిర్మాణదారులతో డీల్స్ కుదుర్చుకుని, ప్రతి ఫ్లోర్‌కు రేట్లు ఫిక్స్ చేస్తున్నారనే మాటలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. సర్కిల్-36 పరిధిలో అనుమతులు లేకుండా గ్రౌండ్ ప్లస్ మల్టిపుల్ ఫ్లోర్స్, పెంట్‌హౌస్‌ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. అయినప్పటికీ, జిహెచ్ఎంసీకి చెల్లించాల్సిన ఫీజులు, పెనాల్టీలు, డెవలప్‌మెంట్ ఛార్జీలు వసూలు కాకపోవడం వల్ల ప్రభుత్వానికి భారీగా ఆదాయం నష్టం జరుగుతోందని స్పష్టమవుతోంది.

### ఫిర్యాదులు చేస్తే టార్గెట్ చేస్తుండ్రు..

కొందరు బాధితులు, స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు స్పందించడం లేదనే ఆవేదనలు వినిపిస్తున్నాయి. 'ఫిర్యాదు చేస్తే మళ్లీ మాపైనే ఒత్తిడి పెడుతున్నారు. నిర్మాణాలు ఆపకుండా, మమ్మల్ని బెదిరిస్తున్నారు' అని వాపోతున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు తక్షణం స్పందించి, సర్కిల్-36లో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. అవసరమైతే అవినీతి నిరోధక సంస్థల ద్వారా దర్యాప్తు జరిపించాలని కోరుతున్నారు. ఖైరతాబాద్ జోన్ సర్కిల్-36లో నిత్యకృత్యంగా మారుతున్న 'సీజ్-వసూళ్ల సిస్టమ్'పై త్వరగా చర్యలు తీసుకోకపోతే, నగరంలో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయడం కష్టమవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



బంజారాహిల్స్ అన్నపూర్ణ స్టూడియో లైన్‌లో గతంలో సీజ్ చేసిన దృశ్యం

'ఎద్దు పుండు కాకికి ముద్దు..' అన్న సామెతను ఒంటబట్టిందో ఏమోగానీ వాళ్ల అవినీతి అంతకంతకూ రెట్టింపవుతోంది. గత బాధ్యులు చూపిన బాటలోనే మేమూ తప్పుకుంటామనే రీతిలో మరింతగా రెచ్చిపోతున్నారు. సర్కారు ఎన్ని నిబంధనలు పెట్టినా, నిఘా వ్యవస్థను పటిష్టం చేసినా టౌన్‌ప్లానింగ్‌లో అక్రమ తతంగాలను మాత్రం అరికట్టలేకపోతున్నారు. నగరం నడిబొడ్డులో ఇదో బహిరంగ దందా మారినా తాము బాధ్యులం కాదన్న రీతిలో ఉన్నతాధికారులూ వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు తీవ్రమవుతున్నాయి.

### ప్రధాన ఆరోపణలు ఇవే..

- సీజ్ నోటీసులను వసూళ్ల సాధనంగా మార్చడం
- అక్రమ నిర్మాణాలకు గోప్యంగా అనుమతులు ఇవ్వడం
- ప్రతి ఫ్లోర్‌కు ప్రత్యేక రేట్లు నిర్ణయించడం
- ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టం కలిగించడం
- ఉన్నతాధికారుల మౌనం

## 31న నిమ్స్ హాస్పిటల్లో వృద్ధుల కోసం ఉచిత ఆరోగ్య శిబిరం



**ఖైరతాబాద్, (జనంసాక్షి) :** పంజాగుట్టలోని నిమ్స్ ఆసుపత్రిలో తెలంగాణ ప్రభుత్వ 'హెల్త్ మిషన్-100' కార్యక్రమంలో భాగం గా, వయో వృద్ధుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకు ని ఉచిత సమగ్ర ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని ఈనెల 31 మంగళవారం నిమ్స్ హాస్పిటల్ ఓల్డ్ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్ నెఫ్రాలజీ సెమినార్ హాల్లో ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1 వరకు నిర్వహించ నున్నట్లు నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలి పారు. ఈ శిబి రాన్ని నిమ్స్‌లోని జెరియాట్రిక్ మెడిసిన్ విభాగం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంతో కలిసి నిర్వ హించనున్నారు. వయో వృద్ధుల శారీరక, మానసి క, కార్యాచరణ ఆరోగ్యాన్ని సమగ్రంగా అంచనా వేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని ఆ యన పేర్కొన్నారు. ఈ సందర్భంగా వయో వృద్ధు ల్లో సాధారణంగా కనిపించే వ్యాధులను గుర్తించేం దుకు పలు ముఖ్య పరీక్షలు నిర్వహించబడతాయ ని అన్నారు. అందులో కంప్లీట్ బ్లడ్ పిక్చర్(సీబీపీ), రాండమ్ బ్లడ్ షుగర్, సెరమ్ క్రియేటినిన్, ఈసీజీ వంటి పరీక్షలు ఉంటాయని తెలిపారు. అవసరమై తే ఫిజియోథెరపీ సేవలు, ప్రొఫెష నల్ కౌన్సెలింగ్ కూడా ఉచితంగా అందించ బడుతుందని అన్నా రు. 60 ఏళ్ళ పైబడిన వయో వృద్ధులు ఈ అవకా శాన్ని వినియోగిం చుకోవాలని కోరారు. హాజరయ్యే వారు ఆధార్ కార్డ్ తప్పనిసరిగా తీసుకు రావాలని అన్నారు.

## తారాభాయి ఆత్మకు శాంతి చేకూరాలి

- కుటుంబ సభ్యులకు ఓదార్పుతో మనోధైర్యం
- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్



**తాండూరు (జనంసాక్షి):** వర్త్య తారా భాయి ఆత్మకు శాంతి చేకూరాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్ భగవంతుని ప్రార్థిం చారు. ఆదివారం తాండూర్ పట్టణం ఇందిరానగర్ లో వర్త్య తారా భాయి మొదటి వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్ మాట్లాడుతూ కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ 13వ వార్డు బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ సురేష్ నాయక్,మాజీ కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్, బీసీ సంఘం నాయకుడు రాజ్ కుమార్, డాక్టర్ తుకారం,వర్త్య ప్రశాంతి,కుటుంబ సభ్యులు (ప్రభుత్వ ఉద్యోగులు)వర్త్య రమేష్ నాయక్, రేణుక భాయ్ తదితరులు ఉన్నారు.

## సురక్ష బీమా యోజన పధకంను సద్వినియోగం చేసుకోవాలి

**రాష్ట్ర మహిళ శక్తి మై వాయిస్ సంఘం అధ్యక్షురాలు హైమారెడ్డి**

**శామీర్ పేట్, (జనంసాక్షి):** మహిళా శక్తి మై వాయిస్ సంఘం ఆధ్వర్యంలో మీ సమస్యబీమా పరిష్కారం అను కార్యక్రమంను శామీర్ పేట్ డివిజన్ పరిధిలోని బాబగూడ పాత గ్రామ పంచాయతీ ఆఫీస్ వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజల సమస్యలపై వినతులు తీసు కొని ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన పథకం కోసం దరఖాస్తులను స్వీకరించారు .ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన పథకంను మేడ్చల్ నియోజకవర్గంలోని ప్రజ లందరికి ఉచితంగా మహిళా శక్తి మై వాయిస్ సంఘం అందిస్తుం దన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్. హైమా రెడ్డి వ్యవస్థాపక అధ్యక్షురాలు మహిళా శక్తి మై వాయిస్ సంఘం, రమేష్ అంబటి, మహిళా శక్తి ట్రెజరర్, రాము ముదిరాజ్ మత్స్య కారుల సంక్షేమ సంఘం మేడ్చల్ జిల్లా డైరెక్టర్, ఆంజనేయులు ముదిరాజ్ , సురేందర్ రెడ్డి గ్రామ పెద్దలు, బిజెపి నాయకులు ఇంద్ర శేఖర్ రెడ్డి, బాలేష్, మురళి, కావ్య, లక్ష్మి, సుగుణలు పాల్గొన్నారు.



# దేవరయాంజాల్ గరుడ సేవ ఘనంగా నిర్వహణ

- ముఖ్య అతిధిగా కీసర సర్కిల్
- డిప్యూటీ కమీషనర్ వసంత



**శామీర్ పేట్, మార్చి 29 (జనంసాక్షి):** శ్రీ రామ నవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని శామీర్ పేట్ డివిజన్ దేవరయాంజాల్‌లో ఉన్న శ్రీ సీతారామ స్వామి దేవస్థానంలో గరుడ సేవ ఘనంగా నిర్వ హించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ రోజు అర్చకులు కందాళ సీతారామ చార్యులు పర్య వేక్షణలో భక్తుల సహకారంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వసంత ,డీఈ సంతోష్ ,అసిస్టెంట్ కమిషనర్ శ్రావణ్ కుమార్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారిని దర్శిం చుకుని హోమ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనం తరం గరుడ సేవలో పాల్గొని తీర్థ ప్రసాదా లను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ మెం బర్ భీమిడి జైపాల్ రెడ్డి,శ్రీ సీతారామ స్వామి దేవస్థానం మాజీ ఛైర్మన్లు పేండం లక్ష్మినారాయణ, దాసరి గోపాల్ రెడ్డి,మాజీ సర్పంచ్లు తిరుపతి లావణ్య శంకర్ గౌడ్,గోల్డ్ శ్రీనివాస్,మాజీ ఎంపీటీసీ వలందాసు సునీత లక్ష్మి,బీజేపీ మున్సిపల్ మాజీ అధ్యక్షులు పట్నం నర్సింహారెడ్డి, మాజీ ధర్మకర్తలు ఎల్లెంకి భారతి,వలందాసు మురళి గౌడ్,బక్కోల శ్రీనివాస్, భక్తులు సింగం రామ రావు,పిన్నింటి ధర్మారెడ్డి, చింతల శ్రీనివాస్ రెడ్డి,బర్ల అనంత రెడ్డి, తిరుపతి అంజనేయులు, కట్ట అనంత రెడ్డి,బెబండి జంగారెడ్డి,నాళ్ళచెరువు శంకరప్ప,రంగప్పగారి నాగరాజు గౌడ్,పన్నాల నితిన్ రెడ్డి,పన్నాల జనార్ధన్ రెడ్డి,కైరంకొండ మధుసూదన్,మేటె బాలయ్య,మిర్యాలకర్ సాయి కుమార్,రాచ కార్తీక్,బర్రెంకబావి కిషోర్ సాయిరెడ్డి,బర్రెంకబావి శ్రావంత్ రెడ్డి,కట్ట శశిధర్ రెడ్డి,తదితర భక్తులు హాజరయ్యారు.

# మున్నూరు కాపుల సంక్షేమమే లక్ష్యం

**రాష్ట్ర అధ్యక్షులు పుటం పురుషోత్తం రావు పటేల్**



**శామీర్ పేట్, (జనంసాక్షి):** శామీర్ పేట మండల ం అలియాబాద్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం మేడ్చల్ జిల్లా మున్నూరుకాపు సంఘం ప్రధాన కార్యదర్శి చాట్లపల్లి నర్సింగ్ రావు ఆధ్వర్య ంలో శామీర్ పేట మండల మున్నూరుకాపుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిధిలుగా మున్నూరుకాపు సం ఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుటం పురుషోత్తం రావు పటేల్, ఉపాధ్యక్షులు మామిండ్ల శ్రీనివాస్ పటేల్, కార్య నిర్వాహక కార్యదర్శి ఆకుల సత్య నారాయణ పటేల్, కార్యదర్శి ఇందూరి తిరుపతి పటేల్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ము న్నూరుకాపు సంఘం శామీర్ పేట మండల నూత న కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా వేల్పుల శ్రీనివాస్ పటేల్ (అలియాబాద్ ), ఉపాధ్యక్షులుగా వాసాలమర్రి రమేష్ పటేల్ (శామీర్ పేట ), ప్రధాన కార్యదర్శిగా మామిండ్ల నర్సింగ్ రావు పటేల్ (లల్గాడిమ లకపేట) , కోశాధికారిగా దేవరశెట్టి రాజు పటేల్ (పోతాయి పల్లి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమం లో మేడ్చల్ జిల్లా అధ్యక్షులు వేల్పుల శ్రీనివాస్ పటేల్, ఉపాధ్యక్షులు సుంకరి వినోద్ పటేల్, సంయుక్త కార్యదర్శి వైల ఎల్లయ్య పటేల్, ఎంసీ పల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేష్ పటేల్, కౌన్సిలర్ తూము శ్యామ్ పటేల్, జిల్లా కార్యదర్శి మామిండ్ల ప్రవీణ్ కుమార్ పటేల్, పెద్దలు మామిండ్ల అశోక్ పటేల్, బుద్ది సత్తయ్య పటేల్, అలియాబాద్ మున్నూరు. కాపు సంఘం అధ్యక్షులుతోట లక్ష్మణ్ పటేల్ పాల్గొన్నారు.

## శామీర్‌పేట మండల బిజెపి ఎస్టీ మోర్చా అధ్యక్షునిగా ధీరావత్ భీమా నాయక్ నియామకం

**శామీర్‌పేట, (జనంసాక్షి):** శామీర్‌పేట మండల (అలియాబాద్ మున్సి పాలిటీ ) బిజెపి ఎస్టీ మోర్చా అధ్యక్షునిగా తుర్కపల్లి గ్రామానికి చెందిన ధీరావత్ భీమా నాయక్ నియామక పత్రం అందుకున్నారు. ఆదివారం భారతీ య జనతా పార్టీ శామీర్‌పేట మండల అధ్యక్షుడు కొరివి కృష్ణ ముదిరాజ్ భీమా నాయక్ కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూతన ంగా నియమి తులైన భీమా నాయక్ మీడియాతో మాట్లాడుతూ తనపై నమ్మకం తో అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన మండల అధ్యక్షుడు కొరివి కృష్ణ ముది రాజ్, జిల్లా, రాష్ట్ర నాయకులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలి యజేశారు. తనకు ఎస్టీ మోర్చా అధ్యక్షునిగా అప్పగించిన బాధ్యతలను పార్టీ అధిష్టానం సూచనల మేరకు సక్రమంగా నిర్వహిస్తూ, పార్టీ బలోపేతానికి తన వంతు కృ షి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నీరుడి అశోక్ కుమార్, మాజీ ప్రధాన కార్యదర్శి కీసరి నర్సింగ్ రావు, మాజీ బీజేవై ఎం అధ్యక్షుడు జివికె.యాదవ్, గ్రామ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, పాల్గొన్నారు.



## త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలి

- ఆధైర్య పడకండి అండగా ఉంటాం
- మాజీ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏ భీమయ్య



**యాలాల (జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హరిప్ త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలని మాజీ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏ భీమయ్య పేర్కొన్నారు. ముద్దాయి పేట్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు హరిప్ అనారోగ్యంతో హైదరాబాద్‌లో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించు కున్న విషయాన్ని తెలుసుకుని ఆదివారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు హరిప్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. మాజీ మండల్ పార్టీ అధ్యక్షులు ఏ భీమయ్య సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ సి బసవరాజ్ యోగక్షేమాలు తెలుసుకొని,కి మనో ధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏ భీమయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ సి బస్వరాజ్, ముకుందాపూర్ సాయిలు, డాక్టర్ ఆసిఫ్ ఖాన్, విశ్వనాథ్ పూర్ నాగప్ప, రగాపూర్ చంద్రయ్య, ఆత్మ కమిటీ డైరెక్టర్ అనంతయ్య, దేవనూర్ గ్రామ కమిటీ అధ్యక్షులు ఖాసిం ,ముదాయి పేట్ బస్వరాజ్, వడ్ల శ్రీనివాస్ చారి, వడ్డే నగేష్, మహిముద్ పాల్గొన్నారు.

# డాక్టర్ ఏఎస్ రావు ఆశయ సాధనకు కృషి చేయాలి

**ఘనంగా డాక్టర్ ఏఎస్ రావు డాక్యుమెంటరీ ఫిలిం గద్దర్ అవార్డు అభినందన సభ**



**కాప్రా , మార్చి 29 (జనంసాక్షి) :** మహా మనిషి డాక్టర్ ఏఎస్ రావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని డాక్టర్ ఏఎస్ రావు నగర్ హౌసింగ్ సొసైటీ పర్సనల్ ఇన్చార్జ్ కే ఈశ్వరయ్య, దాశరథి థియేటర్ అధ్యక్షులు ఎస్ వినయ్ కుమార్ పేర్కొన్నారు. మహా మనిషి డాక్టర్ ఏఎస్ రావు డాక్యుమెంటరీ ఫిలిం కు గద్దర్ అవార్డు వచ్చిన సందర్భంగా శనివారం రాత్రి ఏఎస్ రావు నగర్ లోని డాక్టర్ హోమీ జే బాబా కమ్యూనిటీ హాల్ లో నిర్వహించిన అభినందన సభకు వారు ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. డాక్టర్ ఏఎస్ రావు ఆశయాలు ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయం అన్నారు. మహా మనిషి డాక్టర్ ఏఎస్ రావు గొప్పతనాన్ని ప్రపంచానికి చాటాలనే లక్ష్యంతో ఆయన నిజ జీవితాన్ని డాక్యుమెంటరీగా సినిమా ను చిత్రీకరించినట్లు పేర్కొన్నారు. డాక్టర్ ఏఎస్ రావు డాక్యుమెంటరీ ఫిలిం కు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా గద్దర్ అవార్డు అందుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈసీఐఎల్ సంస్థను స్థాపించి ఎలక్ట్రానిక్స్ రంగం లో దేశానికి విశిష్ట సేవలు అందించిన మహాను భావుడు డాక్టర్ ఏఎస్ రావు అని కొనియాడారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కొత్త రామా రావు మాట్లాడుతూ... డాక్టర్ ఏఎస్ రావు హైదరాబాద్ నగరంలో ఈసీఐఎల్ సంస్థను స్థాపించి వేల కుటుంబాలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. డాక్టర్ ఏఎస్ రావు ఎంతో గొప్ప స్థానంలో ఉన్నప్పటికీ సాధారణ జీవితాన్ని గడుపుతూ ఆదర్శంగా నిలిచారన్నారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో వేల మంది యువ ఇంజనీర్లను దేశానికి అందించిన గొప్ప మేధావి ఏఎస్ రావు అని కొనియాడారు. ఈ సం దర్భంగా మహా మనిషి డాక్టర్ ఏఎస్ రావు చిత్రాన్ని ప్రదర్శించారు. అనంతరం మహా మనిషి డాక్టర్ ఏఎస్ రావు డాక్యుమెంటరీ ఫిల్మ్ లో నటించిన కళాకారులకు, చిత్ర యూనిట్ సభ్యుల ను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించి జ్ఞాపికల తో అభినందించారు. జి యాదగిరిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దాశరథి థియేటర్ ఉపాధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, ప్రతినిధులు పి.బి చారి, ఈసీఐఎల్ మాజీ ఉద్యోగి డాక్టర్ ఏఎస్ రావు సన్నిహితులు వికె ప్రేమ్ చంద్, డాక్టర్ ఏఎస్ రావు డాక్యుమెంటరీ ఫిలిం డైరెక్టర్ యు రఘు రామచంద్ర, ఫిలిం ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ బి డిఎల్ సత్యనారాయణ, డాక్టర్ ఏఎస్ రావు విజ్ఞాన వేదిక దాశరథి థియేటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

**200 మందికి ఉచిత వైద్య పరీక్షలు**

**ఆదిభట్ల మున్సిపల్ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి**



**ఇబ్రహీంపట్నం , (జనంసాక్షి):** వయసు పైబడుతున్న ప్రతి ఒక్కరూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి పూర్తి వైద్య పరీక్షలు చేయించుకోవాలని అదిబట్ల మున్సిపల్ మాజీ చైర్మన్ మరి నిరంజన్ రెడ్డి అన్నారు. ఆదిబట్ల డివిజన్‌లో మర్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో, శ్యామ్ హాస్పిటల్ వారి సౌజన్యంతో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. దాదాపు 200 మందికి ఉచిత వైద్య వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేయడంతో పాటు నిపుణులైన వైద్య బృందం సలహాలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడారు. బీపీ షుగర్ ఇతర సమస్యలతో బాధపడేవారు నిర్లక్ష్యం చేయ కుండా పరీక్షలు చేయించు కోవాలని చెప్పారు. నిత్యం వ్యాయామం చేయడం వల్ల మెరుగైన ఆరోగ్యం ఉంటుందని క్రమం తప్పకుండా వ్యాయామం అలవా టు చేసుకోవాలని చెప్పారు. ఆరోగ్య వైద్య శిబిరాలను ప్రజలంతా సద్విని యోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య బృందం మాజీ జెడ్పిటిసి భూపతిగల్లా మహిపాల్, మాజీ వైస్ చైర్మన్ కోరే కళమ్మ జంగయ్య, పాల్గొన్నారు.

## విజయవంతంగా కొనసాగిన అమ్మకు అక్షరమాల



**శంకర్ పల్లి, మార్చి 29(జనంసాక్షి):** పొదుపు సంఘాలలోని మహిళలందరూ విద్యావంతులు కావాలని లక్ష్యంతో చేపట్టిన అమ్మకు అక్షరమాల కార్యక్రమం విజయవంతంగా సాగిందని శంకర్పల్లి మహిళా సమాఖ్య ఏపీఎం రవీందర్ తెలిపారు. ఉల్లాస్ – నవభారత్ సాక్షర భారత్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మొదటి విడత గ్రామాలలో పొదుపు సంఘాల మహిళలకు పరీక్షలు నిర్వహించారు. 1300 మంది పొదుపు గ్రూప్ మహిళలకు అమ్మకు అక్షరమాల కార్యక్రమంలో భాగంగా పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వం పొదుపు గ్రూపులో చేరిన మహిళలను విద్యావంతులు చేయాలని లక్ష్యంతో రాత్రిపూట చదువు నేర్పే కార్యక్రమాన్ని నిర్వహించింది. అందులో భాగంగా ఆయా గ్రామ పంచాయతీలలో సర్పంచుల ఆధ్వర్యంలో ఆదివారం పరీక్షలు నిర్వహించారు. మిగిలిపోయిన గ్రామాలలో రెండో విడతలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఏపీ ఎం రవీందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్లు వివోఏలు పాల్గొన్నారు.

# ప్రధాని మన్ కీ బాత్' వీక్షించిన బీజేపీ శ్రేణులు



**రాజేంద్రనగర్, (జనంసాక్షి):** మైలార్దేవపల్లి బీజేపీ ఆధ్వర్యంలో దుర్గానగర్‌లో 'మన్ కీ బాత్' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రసంగాన్ని కార్యకర్తలు శ్రద్ధగా విన్నారు. బొమ్మరాజు నరసింహ నివాసంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని డివిజన్ అధ్యక్షుడు సూరెడ్డి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ప్రధాని తన ప్రసంగంలో దేశ అభివృద్ధి, యువత పాత్ర, స్వచ్ఛ భారత్, ఆత్మనిర్భర్ భారత్, మహిళా సాధికారత, స్టార్ట్-అప్స్ ప్రోత్సాహం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను ప్రస్తావించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా నాయకులు ఆడికే రాజు, బల్లా శ్రీనివాస్ యాదవ్, జి.అంజి,డి.వేణు, వి.నిఖిల్, వి.బాబూజీ,కె.సాయో కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినయ్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నాయకులు దుర్గానగర్ బస్తీలో పర్యటించి, ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని నిర్ణయించారు. మణికొండ, నెక్నాంపూర్ డివిజన్లలో భాజపా కార్యాలయంలో 'మన్ కీ బాత్' 132వ ఎపిసోడ్‌ను వీక్షించారు. ప్రధాని తన ప్రసంగంలో భారత క్రికెట్ జట్టు ప్రపంచ కప్ విజయం, జమ్మూకాశ్మీర్ రంజీ ట్రోఫీ సాధనను కొనియాడారు. యువత క్రీడల్లో పాల్గొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. నాగాలాండ్ సంస్కృతిని కాపాడా ల్సిన అవసరాన్ని, మత్స్యకారుల పాత్రను ప్రస్తావిస్తూ దేశ ఆర్థికాభివృద్ధిలో వారి భాగస్వామ్యాన్ని గుర్తుచేశారు. అలాగే ప్రతి పౌరుడు దేశాభివృద్ధికి తోడ్పడాలని, సోలార్ విద్యుత్ వినియోగాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మణికొండ మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్ రెడ్డి, బీజేపీ నాయకులు బి. రవికాంత్ రెడ్డి, కంకణాల శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లిలో ఉచిత హోమియో వైద్య శిబిరం




**యాచారం (జనంసాక్షి) :** ప్రొద్దుటూ రి. రామలింగయ్య గుప్తా ఫౌండేషన్ పి ఆర్‌జి అధ్యక్షులు ప్రొద్దుటూరి రవీందర్ గుప్త ఆధ్వర్యంలో ఆది వారం మహదేవ్ హోమియో క్లినిక్ డాక్టర్ ప్రొద్దుటూరు రాధిక ఆధ్వర్యం లో మేడిపల్లి గ్రామంలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 130 మంది రోగులకు బీపీ ,షుగర్ వివిధ రకాల వైద్య పరీక్ష లను చేయించు కున్నారు. రోగులకు మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రొద్దుటూరి.రాధిక ప్రసన్న కుమార్ , సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్ మాట్లాడుతూ... పేదలు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.ప్రజల్లో పలు రకాల వ్యాధులను రూపుమా పడానికి ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతగానో దోహద పడుతాయన్నారు. నేటి సమాజంలో ప్రజలు మారుతున్న వాతావరణంతో పాటు ఆహారపు అలవాట్ల కారణంగా ఆరోగ్య పరమైన సమస్యలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ దెంది మధుకర్ రెడ్డి, ఏబీజీ ఫౌండేషన్ అధ్యక్షులు ఆడాల గణేష్, బేత జంగయ్య, యాచారం ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు విరబొమ్మల శ్రీనివాస్ గుప్త, ఫౌండేషన్ సభ్యులు ప్రొద్దుటూరు సురేందర్ గుప్త, ప్రసన్న కుమార్ గుప్త, పవన్ కళ్యాణ్ ఉన్నారు .

# అమ్మకు అక్షరమాల ద్వారా వయోజన విద్యాభివృద్ధి

**పెద్దేముల్ మార్చి 29(జనంసాక్షి):** ప్రభుత్వం చేపట్టిన అమ్మకు అక్ష రమాల కార్యక్రమం ద్వారా వయోజన విద్యాభివృద్ధి చెందుతుందని తింసాన్ పల్లి గ్రామ సర్పంచ్ గుడిసె చంద్రకళ,శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని తింసాన్ పల్లి, అత్కూర్,తట్టేపల్లి,ఇందూర్,గ్రామంలో సిసి.బల్ రాజ్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్షరాలు దిద్ది చదువు నేర్చుకోవడానికి వయస్సుతో సంబంధం లేదని,15 నుంచి 60 ఏళ్ల లోపు వారందరు చదువుకోవాలన్నారు. చదువుతోనే సమాజంలో మంచి గు ర్తింపు, గౌరవం లభిస్తుందన్నారు. గత మూడు నెలల్లో ఉల్లాస్ అక్షరాస్యత కేంద్రాల ద్వారా చదువుకొని నిరక్షరాస్యులా నిర్మూలం గురించి ప్రభుత్వం పెద్ద పీఠం వేసిందన్నారు. ముఖ్యంగా స్వయం సహకార సంఘాల్లోని నిరాక్షరాశు లయిన మహిళలకు అక్షర జ్ఞానం పెంపొందించడానికి ఇది ఎంతో తోడ్పాటును ఇస్తుందన్నారు. ఈ పరీక్ష ప్రశ్నా పత్రాల లో చిన్న చిన్న అర్థాలతో కూడిన పేర్లు ఖాళీలను పూరిచాలి,అలాగే కూడికలు,తీసివేతల తో పరీక్ష నిర్వహించారు .గత మూడు నెలలుగా మహిళలు చదువుకొని ఎగ్జామ్ రాశారని తెలిపారు. ఎగ్జామ్ గ్రేడింగ్లను ఏ బి సి విధానాలతో ఫలితాలు వస్తాయన్నారు. ఈఎగ్జామ్ లో మంచి మార్కులతో పాసైన వారికి పదవ తరగతి అలాగే, ఇంటర్, ఓపన్ డిగ్రీ, చేయడానికి వెసులుబాటు కల్పిస్తుందన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు. పెద్దేముల్ మండలంలోని గ్రామ సంఘాల అధ్యక్షురాలు మంజుల మల్లమ్మ , సీత బాయి, నర్సమ్మ సువర్ణ, వివో ఏలు గుడిసె, కృష్ణ.నాగలక్ష్మి.స్వప్న.వెంకటమ్మ. పాల్గొన్నారు.



## ఘనంగా టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవం



**మల్కాజిగిరి (జనంసాక్షి):** మల్కాజిగిరి నియోజకవర్గంలోని సఫీల్‌గూడ , గాంధీనగర్‌లలో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కోఆర్డినేటర్లు కరణం గోపి, వగ్గు చంద్రశేఖర్ రావు, పిట్ల రామకృష్ణ ముదిరాజ్, బిగ్గుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం నాయకులు కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేయడంతో పాటు నిరుపేదలకు పండ్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త పునరం కితం కావాలని పిలుపునిచ్చారు.పార్టీ బలోపేతానికి కార్యకర్తలే వెన్నెముకని రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాటం ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో నర్సమ్మ, విశాలి, లక్ష్మి, బిగ్గుల ప్రతాప్, రాజు గౌడ్, రమేష్ తదితర ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దోర్నాలపల్లి సర్పంచ్ ఆధ్వర్యంలో ఉల్లాస్ పరీక్ష

గ్రామ సర్పంచ్ సత్యనారాయణ రెడ్డి



**పరిగి మార్చ్ 29 (జనంసాక్షి):** వికారాబాద్ జిల్లా దోమ మండల పరిధిలోని దోర్నాలపల్లి గ్రామపంచాయతీలో ఉల్లాస్ అమ్మకు అక్షరమాల కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాలలో ఉన్నటువంటి సభ్యులకు గ్రామపంచాయతీలో మహిళలు పరీక్ష రాయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు విజయ రెడ్డి, సీసీ నారాయణ, వివో ఏ యాదమ్మ, గ్రామ పెద్దలు నరసింహారెడ్డి, పట్లోళ్ల వెంకటరెడ్డి, యూత్ ప్రెసిడెంట్ ప్రమోద్ రెడ్డి, ఉప సర్పంచ్ మహిపాల్,గ్రామ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దశదిన కర్మలో పాల్గొన్న భీమ్ భరత్



**మొయినాబాద్, (జనంసాక్షి):** చేవెళ్ల మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి తన తల్లి దశదిన కర్మలో పాల్గొన్న చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి భీమ్ భరత్ పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మానయ్య, మహేందర్ రెడ్డి, మొయినాబాద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని నివాళులర్పించారు.

## నేడు తుంకిమెట్ల కూరగాయల సంత తైబజార్ వేలంపాట

**పంచాయతీ కార్యదర్శి సిద్దయ్య**



**బొంరాస్ పేట, (జనంసాక్షి):** మండల పరిధిలోని తుంకిమెట్ల గ్రామంలో ప్రతి ఆదివారం నిర్వహించే కూరగాయల వారాంతపు సంతకు సంబంధించి 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను తైబజార్ వేలంపాట నిర్వహించడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి సిద్దయ్య తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు రైతు వేదిక భవనంలో నిర్వహించే వేలంపాటలో పాల్గొనాలని ఆసక్తి ఉన్నవారు గంట ముందుగా రూ.3,000 డిపాజిట్ సొమ్ము చెల్లించాలని కోరారు.

# దళితులపై కుల వివక్షత ఆగేది ఎప్పుడు?

- బోడుప్పల్లో 371వ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు జ్ఞానమాల
- అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య



**బోడుప్పల్ (జనంసాక్షి):** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 371వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. అనంతరం అంబేద్కర్ ఆశ సాధన సంఘం సభ్యులు కీర్తిశేషులు ఈతకోట గోపాలకృష్ణ 2వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించారు ఈతకోట గోపాలకృష్ణ అంబేద్కర్ సిద్ధాంతాల కోసం, ఆశయ సాధన సంఘం కోసం ఆయనచేసిన కృషిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ 79 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఇంకా కుల వివక్ష కోరలు చాచుతుందని, అగ్రకుల నేతలు కొందరు దళితులను ఆలయ ప్రవేశం లేకుండా అవమాన పరుస్తున్నారని శ్రీరామనవ ఉత్సవాల సందర్భంగా శామీర్పేట్ మండలం ఆదాష్ పల్లెలో దళితులను శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవంలో పాల్గొన కుండా దేవుడిపై తలంబ్రాలు వేయలేదని ఇలాంటి ఘటనలు నిత్యం తరచుగా జరుగుతున్నాయని, అలాంటి వ్యక్తుల పైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు బుగ్గ మైస య్య, కాంగ్రెస్ యువ నాయకుడు మందుల సూర్య కిరణ్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇటుకల రవీందర్ ,గరుగుల యాకయ్య, సగ్గు నరసింహ, బండారి సాయి, జోగు రమేష్, జై భీమ్ అజయ్ పాల్గొన్నారు.

## మాదక దవ్యాల వినియోగంపై ప్రభుత్వం ఉక్కుపాదం

**ఫామ్ హౌస్ యజమానులు చట్ట విరుద్ధమైన కార్యక్రమాలు చెయ్యకూడదు**
**మహేశ్వరం ఎక్సైజ్ శాఖ సీఐ తిరుపతి రెడ్డి**



**మహేశ్వరం, (జనంసాక్షి):** ప్రైవేట్ వేదికలపై అక్రమ మద్యం,మాదకద్రవ్యాల వినియోగంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని మహేశ్వరం ఎక్సైజ్ శాఖ సిఐ తిరుపతిరెడ్డి ఆదివారం పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు.మండల పరిధిలోని ఫామ్ హౌస్ లు,రిసార్టులు, ఫంక్షన్ హాల్ యజమానులకు అనుమతి లేకుండా మద్యం ,డ్రగ్స్ వాడకంపై ముమ్మర తనిఖీలు నిర్వహిస్తామన్నారు.అనుమతులు లేకుండా మద్యం, నిషేధిత పదార్థాలను సరఫరా చేస్తున్న వేదికలపై ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ఫామ్ హౌస్ ,రిసార్ట్ యజమానులు, నిర్వాహకులు చట్ట విరుద్ధమైన కార్యక్రమాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత యజమానులదే అన్నారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.ద

## ఘనంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం

**కాప్రా , మార్చి 29 (జనంసాక్షి ) :** ఏ ఎస్ రావు నగర్ డివిజన్ లో తెలుగు దేశం పార్టీ 44 వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాజిగిరి మేడ్చల్ జిల్లా కన్వీనర్ కందికంటి అశోక్ కుమార్ గౌడ్ హాజరై జమ్మిగడ్డ లో యన్ టి ఆర్ సర్కిల్ దగ్గర స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు. అనంతరం బి జె ఆర్ కాలనీ,సౌత్ కమలానగర్ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గడ్డమిధి రాములు యాదవ్,తెలంగాణ తెలుగు దేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరు కొండ సతీష్ బాబు, టి యన్ ఎస్ ఎఫ్ రాష్ట్ర మాజీ జనరల్ సెక్రటరీ శివానంద్, డా ఏ ఎస్ రావు నగర్ డివిజన్ మాజీ ఉపాధ్యక్షుడు మొవ్వ శ్రీనివాస కుమార్, మదమంచి బుచ్చయ్య చౌదరి,,సీనియర్ నేతలు బింగి బిక్షపతి గౌడ్,కొమ్ము ఉపేందర్, గోబేరు రమేష్, పోట్ల సతీష్ కుమార్, ఉన్నం నవీన్ చౌదరీ, వడ్లమూడి శ్రీనివాస్, బొప్పన శ్రీనివాస్, వెంకట్ నాయుడు, వెంకటేష్, హరికృష్ణ దుర్గేష్, మోహిత్, కేతన్, రవి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**సికింద్రాబాద్ (జనంసాక్షి):** రానున్న ఎన్నికల్లో లష్కర్ లో టీడీపీ జెండా ఎగురుతుందని సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వల్లారపు శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. లస్కర్ ఒకప్పుడు టిడిపి కి కంచుకోటగా ఉండేదని తిరిగి పూర్వ వైభవం తీసుకొస్తామని ఆయన పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను టీడీపీ నాయకులు సికింద్రాబాద్ అసెంబ్లీ పరిధిలోని అన్ని డివిజన్ లలో పార్టీ జెండా ఎగురవేసి, స్వీట్లు, పళ్లు పంచి పెడుతూ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు వల్లారపు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వల్లారపు శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలుగువారి కీర్తిని ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పిన ఘనత నందమూరి తారకరామారావు కే దక్కుతుందని అన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల మహిళలు, కార్మికులు, రైతుల అభ్యున్నతికోసం ఏర్పడిన పార్టీ తెలుగు దేశం పార్టీ అని గుర్తు చేశారు. అభివృద్ధికి మారుపేరు తెలుగుదేశం పార్టీ అని ఆయన అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జిఎం.రమేష్, గండికోట విజయ్ కుమార్, చందర్ ముదిరాజ్, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన వయోజనుల ఎన్ఐఓఎస్ పరీక్షలు

**ఉత్సాహంగా పరీక్షలు వ్రాసిన మహిళలు**
**తలకొండపల్లి ఏపీఎం రామస్వామి**



**తలకొండపల్లి (జనంసాక్షి):** మండల పరిధిలోని 32 గ్రామపంచాయతీలలో వయోజనులైన నిరక్షరాస్యులు అమ్మకు అక్షరమాల ప్రోగ్రాం ద్వారా కేంద్రాలలో చదువుకున్న వారికి నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ ద్వారా ఆదివారం నిర్వహించిన పరీక్షలను ఎంతో ఉత్సాహంగా వ్రాశారు.ఈ పరీక్షా నిర్వహణ కేంద్రాలను మండల మహిళా సమాఖ్య ఏపీఎం రామస్వామి, సీసీలు,ఆయా గ్రామాల సర్పంచులు కాసు శ్రీనివాస్ రెడ్డి,కటికల శేఖర్ యాదవ్,గుజ్జుల లక్ష్మమ్మ,కళ్యాణ్ నాయక్ పర్యవేక్షణ చేసి పరీక్షలు సక్రమంగా జరిగేటట్లు చూశారు.ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ..నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు అమ్మకు అక్షరమాల ప్రోగ్రాం ద్వారా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.ఎన్ఐఓఎస్ పరీక్షలు వ్రాసి పాసైన ప్రతి వ్యక్తికి అక్షరాస్యునిగా గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. మహిళలు, పురుషులు, అత్యధికంగా పరీక్షలు వ్రాసి విజయవంతం చేసినట్లు తెలిపారు.కార్యక్రమంలో వివోఏ,లు ప్రజా ప్రతినిధులు,నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# నారెగూడెం హైస్కూల్ పనితీరు అధ్వానం..!

### ఏడుగురు ఉపాధ్యాయులు ఎనిమిది మంది విద్యార్థులు సమయపాలన పాటించని ఉపాధ్యాయులు



**నవాబుపేట్ మార్చి 29(జనం సాక్షి)** మండలం పరిధిలోని నారే గూడెం పాఠశాలల్లో విద్యార్థుల భవిష్యత్తుపై నీలి నీడలు కమ్ముకున్నాయి. పిల్లల చదువుపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ విధులు నిర్వహించే ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదు ఏటా ఉత్తీర్ణమి శాతం తగ్గుతుండడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నారు. శనివారం పాఠశాలకు విద్యార్థులు తల్లిదండ్రులు వెళ్లి చూడగా పాఠశాలలో ఉపాధ్యాయులు పేపర్లో, ఫోన్లు, కొంతమంది ఉపాధ్యాయులు పాఠశాల నుండి పరువు దూరం వరకు వెళ్లి వస్తున్నారు ఎందుకు వెళుతున్నారు.ఎవరికి అర్థం కాని వ్యర్థం అవుతున్నపాఠశాల పంతుల పని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీ పాఠశాల యొక్క సమస్యలు అడిగితే విద్యార్థులు రాకపోతే మేము ఏమి చేయాలి ప్రతిరోజు పాఠశాలకు వస్తున్నాము విద్యార్థులు రాకపోతే మేము ఏమి చేయాలి అంటూ చేతులు దులుపుకుంటున్నారు విద్యార్థులపై ఆలోచన లు కన పడటం లేదంటున్నారు.ఉదయం 8 గంటల 45 నిమిషాలకు రా వచ్చిన ఉపాధ్యాయులు 9 గంటల 30 నిమిషాలకు పాఠశాలకు వస్తున్నారు. ఉపాధ్యాయులు మాకేం పర్వ మా పాఠశాల మా ఇష్టము వచ్చినట్లు వస్తాము అన్నట్లు పాఠశాలకు సమయపాలన పాటించకుండా 9:30.. సమయం అయిన హాజరవుతున్నారు. పాఠశాలలో విద్యార్థులు సంఖ్య 6 వ. తరగతిలో(0)7.వ తరగతిలో(0) 8వ తరగతిలో (6) 9.వ తరగతిలో (0)10వ. తరగతిలో (2) మొత్తము హై స్కూల్ విద్యార్థులు సంఖ్య..8. మొత్తము ఉపాధ్యాయులు.. 7.. మంది ఎనిమిది మంది విద్యార్థులకు విద్యను అందిస్తున్నారు ఎంత ఘనత ఈ పాఠశాలలో అధికారులు ఆలోచించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు 2023 - 20024 సంవత్సరంలో పదవ తరగతి లో 7. మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు వ్రాయగా ఒకరు మాత్రమే పాసైనారు. 2024-2025 ముగ్గురు విద్యార్థులు పరీక్ష వ్రాయగా ఒక విద్యార్థి మాత్రమే పాసైనారు. 2025-2026 సంవత్సరంలో ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఉన్నారు పరీక్షలు రాస్తున్నారు అందులో ఇద్దరు పాస్ అవుతారా వేచి చూస్తున్నామన్నారు గ్రామస్తులు ఈ పాఠశాలపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పాఠశాల పై దృష్టి లేదంటున్నారు. ఎనిమిది మంది విద్యార్థులకు ఏడుగురు ఉపాధ్యాయులు విద్యను బోధిస్తున్నారంటే జిల్లాలోని ఆశ్చర్యపోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యార్థులకు తల్లిదండ్రులు బోరుణ వినిపిస్తున్నారు. పదవ తరగతిలో 7.గురు ఉపాధ్యాయులు ఉండి లాస్ట్ ఇయర్ ముగ్గురిలో ఒకరి పాసయ్యారు అంటే ఎంత విద్యను బోధిస్తున్నారు అధికారులకు అర్థమవుతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అందుకు ఇకనైనా విద్య అధికారులు నారే గూడెం పాఠశాలపై పర్యవేక్షించి మన బాలికలకు సరైన విద్యను అందించి వారికున్న లక్షల ను చేరుకునే వరకు విద్యను బోధించినట్లయితే విద్యార్థులు మంచి భవిష్యత్తులో బాటలో నమస్కారం టు గ్రామస్తులు పేర్కొంటున్నారు.



## రోడ్డు పనులలో నిర్లక్ష్యం..

# దుమ్ముతో ఉక్కిరిబిక్కిరి గ్రామం

### తాండూర్ హైదరాబాద్ ప్రధాన రహదారిపై ధర్నా

**ధారూర్ మర్చి 29(జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా ధారూర్ మండల పరిధిలోని కెరెల్లి గ్రామంలో రహదారి పనుల నిర్లక్ష్యంపై గ్రామస్థులు ఆగ్రహంతో ధర్నాకు దిగారు. తాండూరు.హైదరాబాద్ రోడ్డుపై సుమారు గంటసేపు వాహనాలను నిలిపివేయడంతో ప్రయాణికులు ముఖ్యంగా వృద్ధులు.ఆసుపత్రికి వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.మూడు నెలల క్రితం సీసీ రోడ్డు నిర్మాణం పేరుతో తవ్విన రహదారి ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో గ్రామం మొత్తం దుమ్ముతో కప్పుకుపోయింది.రోజూ భారీ వాహనాల రాకపోకల వల్ల ఎగిసిపడుతున్న దుమ్ము ఇళ్లలోకి,పాఠశాలలలోకి చేరి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది.ముఖ్యంగా చిన్నారులు శ్వాసకోశ సమస్యలు,అలర్జీలు,జలుబు వంటి అనారోగ్యాలతో బాధపడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దుమ్ము ప్రభావంతో



పంటల పెరుగుదల కూడా దెబ్బతిని రైతులు నష్టపోతున్నారు. పలుమార్లు సమస్యను అధికారులు,ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో గ్రామస్థులు రోడ్డెక్కాల్సి వచ్చిందని తెలిపారు.సమాచారం అందుకున్న ధారూర్ ఎస్ఐ రాఘవేందర్ ఘటనాస్థలానికి చేరుకుని గ్రామస్తులతో చర్చించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ధర్నాను విరమించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రహదారి పనులను పూర్తి చేసి,గ్రామాన్ని దుమ్ము సమస్య నుంచి విముక్తి కల్పించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఇద్దరిపై దాడి.. ఒకరు విషమం



**ధారూర్, మర్చి 29(జనంసాక్షి) :** మండల పరిధిలోని నాసన్‌పల్లి గ్రామంలో జరిగిన దాడి ఘటన స్థానికంగా కలకలం రేపింది.వడ్డే రమేష్ అనే వ్యక్తి నాగార్జున అనే వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్థులకు సమాచారం ప్రకారం,వడ్డే రమేష్ నాగార్జునపై కత్తితో తలపై దాడి చేయగా అక్కడికి వచ్చిన మహిపాల్ అనే వ్యక్తి "ఎందుకు కొడుతున్నావు" అని ప్రశ్నించాడు.దీంతో ఆగ్రహించిన రమేష్, మహిపాల్‌పై కూడా దాడి చేసి.అతని ఎడమ చేయి విరిగేలా తీవ్రంగా గాయపరిచినట్లు తెలిసింది.గాయపడిన నాగార్జున మరియు మహిపాల్‌ను వెంటనే వికారాబాద్‌లోని ఈశా హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇందులో మహిపాల్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

## దొడ్డి కొమురయ్య ఉత్సవ కమిటీ సభ్యులుగా మరాటి మల్లేష్ కురుమ



**బోడుప్పల్ -జనంసాక్షి :** తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా మరింత ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా కమిటీని ప్రకటించింది. ఈ కమిటీలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ సర్కిల్‌కు దేవేందర్నగర్ కాలనీకి చెందిన మరాటి మల్లేష్ కురుమను సభ్యునిగా నియమించింది. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో దొడ్డి కొమురయ్య కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఆయన త్యాగస్ఫూర్తిని యువతకు పరిచయం చేయడం, పోరాట చరిత్రను ప్రజల్లో విస్తృతంగా చాటిచెప్పడం లక్ష్యంగా ఈ కమిటీ పనిచేయనుందని అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జయంతి, వర్ధంతి కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. మరాటి మల్లేష్ కురుమను కమిటీ సభ్యునిగా ఎంపిక చేయడం పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు,కురుమ సంఘం నాయకులు,సామాజిక వర్గాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజలకు దగ్గరగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిటీలో అవకాశం కల్పించిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యలకు మరాటి మల్లేష్ కురుమ కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కమిటీ లక్ష్యాల సాధనలో కృషి చేస్తానని ఆయన వెల్లడించారు.

## వందమీటర్ల స్పీడ్ వాకింగ్‌లో పట్నం మహేందర్ రెడ్డికి రెండవ బహుమతి

### ఆర్చరీ పోటీలలో పట్నం మహేందర్ రెడ్డి నాలుగో స్థానం



**తాండూరు మార్చి 29 (జనంసాక్షి)** ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడా పోటీలలో భాగంగా 100 మీటర్ల స్పీడ్ వాకింగ్ లో శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి. రెండవ బహుమతి సాధించారు.రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి లక్ష్మణ్, తీన్మార్ మల్లన్న, అనిరుద్ రెడ్డి, లక్ష్మణ్ నాయక్ ,రాజ్ ఠాకూర్ తదితరులు ఈ పోటీలో పాల్గొనగా, తీన్మార్ మల్లన్న మొదటి స్థానాన్ని, మహేందర్ రెడ్డి రెండవ స్థానాన్ని కైవసం చేసుకొనడంతో అందరూ వారిని అభినందించారు. శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులకు నిర్వహిస్తున్న క్రీడా పోటీలలో ఆదివారం ఆర్చరీ పోటీలలో పాల్గొన్న పట్నం మహేందర్ రెడ్డి నాలుగో స్థానంలో నిలిచారు. నాలుగు రౌండ్లలో 25 పాయింట్లు సాధించిన మహేందర్ రెడ్డి నాలుగవ స్థానంలో నిలువగా, క్రీడా శాఖ మంత్రి తదితరులు ఆయనను అభినందించారు. రాజ్ ఠాకూర్ మొదటి స్థానంలో నిలిచారు. రెండవ స్థానంలో తీన్మార్ మల్లన్న నిలిచారు.ఈ సందర్భంగా క్రీడలతోని మానసిక ప్రశాంతత శారీర దృఢత్వం లభిస్తుందని తెలిపారు.

## అరైవ్ ఆన్‌లైన్‌లో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరం

**జిల్లా ఎస్పీ స్నేహ మెహర**



**మోమిన్ పేట మార్చి 29( జనం సాక్షి) :** అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరం వాహనదారుల భద్రతే ప్రధాన లక్ష్యం: జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, పేర్కొన్నారు ఆదివారం తెలంగాణ రాష్ట్ర డీజీపీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన "అరైవ్ ఆన్లైన్ కార్యక్రమంలో భాగంగా, వికారాబాద్ జిల్లా మోమిన్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏజేఆర్ గార్డెన్స్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, శిబిరాన్ని ప్రారంభించి, వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ప్రతి వాహనదారుడి బాధ్యత అని తెలిపారు. ముఖ్యంగా వాహనం నడిపే సమయంలో స్పష్టమైన కంటి చూపు ఉండటం అత్యంత అవసరమని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. డీజీపీ మార్గదర్శకత్వంలో "అరైవ్ అలైవ్" కార్యక్రమం మూడవ విడతలో భాగంగా జిల్లావ్యాప్తంగా పలు కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో నిపుణులైన వైద్యులు వాహనదారులకు కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టి లోపాలు ఉన్నవారిని గుర్తించారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్, వికారాబాద్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, మోమిన్ పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. వెంకట్, ధరూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రఘు రాములు,ఎంవిఐ శ్రీ లక్ష్మి, మోమిన్ పేట్ సర్పంచ్ సంధ్య, ఎస్ఐ భరత్ భూషణ్లు, పోలీస్ సిబ్బంది మరియు వాహనదారులు పాల్గొన్నారు.

## నిరుపేద ప్రజలందరికీ ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ఓ వరం లాంటిది




**మోమిన్‌పేట మార్చి 29 (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నిరుపేద ప్రజలందరికీ ఓ వరం లాంటిదని ప్రతి ఒక్క నిరుపేద లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై మహేందర్ రెడ్డి పేర్కొన్నారు ఆదివారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎన్ ఓ సి లను పంపిణీ చేశారు ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో నిరుపేదలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి డబ్బులు వృధా చేసుకుంటున్నా వారి సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. 26 లక్షల 96 వేల 500 సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మన్నె శంకర్ యాదవ్ మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు కోసిగి సురేందర్ మోమిన్ పేట గ్రామ సర్పంచ్ సంధ్య సుభాష్ గౌడ్ మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య వివిధ గ్రామాల సర్పంచులు కావలి శ్రీనివాస్ గుజ్జరి కిష్టయ్య అశోక్ వరప్రసాద్ రెడ్డి లావణ్య హరీష్ కుమార్ గౌడ్ అనంతరెడ్డి బాల్ రాజ్ గౌడ్ బాల్ రెడ్డి మహేందర్ చారి లాయక్ అలీ వెంకటేశం పులి గారి బాబు సమ్మని నర్సింలు సత్యనారాయణ గౌడ్ వివిధ గ్రామాల ఉపసర్పంచ్లో వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# రేవంత్ రెడ్డి నిర్ణయం సమస్యలు పరిష్కరించే విధంగా ఉంటుందనుకున్నాం

## ధర్నా చౌక్ ఉండి ఏమి లాభం?

**ఇంకెన్ని రోజులు ధర్నాలు చేయాలి?**

**ఏజెన్సీ వ్యవస్థను రద్దుచేసి ఖజానా నుండి జీతాలు చెల్లించాలి**

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**



**ముషీరాబాద్, మార్చ్ 29 (జనం సాక్షి):** కెసిఆర్ ఇక ముందు ధర్నా చౌక్ ఉండదు అని అన్నారని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ధర్నా చౌక్ ఉంటుంది అని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం ప్రజాస్వామ్యబద్ధంగా సమస్యలు పరిష్కరించే విధంగా ఉంటుందని అనుకున్నాము, కానీ ధర్నా చౌక్ ఉంటుంది, తమకు ఇష్టం ఉన్నన్ని రోజులు ధర్నాలు చేసుకోండి అనే తరహాలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందనీ, మరి ధర్నా చౌక్ ఉండి కూడా ఏం లాభం.. ఇంకా ఎన్ని రోజులు ఈ ధర్నాలు చేయాలని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు హైదరాబాద్, ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ఆదివారం ఔట్ సోర్సింగ్ జేఏసీ ఉద్యోగుల ఆధ్వర్యంలో క్రమబద్ధీకరణ పలు డిమాండ్లతో కూడిన మహా ధర్నా నిర్వహించారు. ఈ మహా ధర్నాకు ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి,బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, డీఎస్పీ వ్యవస్థాపకుడు శారదన్ మహారాజ్,పలువురు నాయకులు హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నా తనకు కూడా ఎంతో కొంత ఆ పాపంలో భాగస్వామ్యం ఉంటుందన్నారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులను ఉద్దేశించి తమ జీవితాల్లో ఆనాడే మార్పు తేలేకపోయినందుకు మీ చెల్లిగా మీ, సోదరిగా క్షమించాలని కోరుతున్నాను అని ఆమె అన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయకపోవడం అన్యాయం అన్నారు. ఏజెన్సీ వ్యవస్థను రద్దుచేసి ఉద్యోగులకు వేతనాలు నేరుగా ప్రభుత్వ ఖజానా ద్వారా చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ కమిటీ ప్రెసిడెంట్ పి లక్ష్మయ్య మాట్లాడుతూ సమాన వేతనం, ఈపీఎఫ్ ఈఎస్ఐ మెడికల్ సదుపాయాలు చెల్లింపు, సెలవులు వంటి ప్రాథమిక హక్కులు కూడా అమలు చేయకపోవడం దారుణం అని పేర్కొన్నారు ఇది కార్మిక చట్టాల ఉల్లంఘన అని స్పష్టం చేశారు. ఈ మహా ధర్నాలో తెలంగాణ జేఏసీ కమిటీ అవుట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బాలకృష్ణారెడ్డి, ఔట్సోర్సింగ్ఉద్యోగులు పాల్గొన్నారు.



# కాళ్లు మొక్కుతానన్నా.. కనికరం లేదా..?

**పోలీసుల లాఠీ దెబ్బలకు గాయపడిన బాధితుడిని పరామర్శించిన సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మైపాల్**



**ధారూర్ మర్చి29(జనంసాక్షి) :** పెత్తందారుల ప్రభావానికి ఓ కూలి పై కాళ్లు మొక్కుతా సార్ నన్ను కొట్టకండి అని వేడుకున్న కనికరించని పోలీసులు విచక్షణ రహితంగా కొట్టి నేరాన్ని ఒప్పుకోమని చిత్రహింసలు పెట్టారని సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.మైపాల్ ఆరోపించారు.మండల పరిధిలోని మోమిన్‌కలాన్ గ్రామానికి చెందిన రహిమతుల్లా అనే వ్యక్తి పోలీసుల లాఠీ దెబ్బలకు గాయపడి ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడిని సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్, సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు మల్లేశం, సద్భావన ఫోరం జిల్లా కార్యదర్శి జాకీర్ హుస్సేన్. ప్రజాసంఘాల నాయకులు శ్రీనివాస్ పరామర్శించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...రహిమతుల్లా సంవత్సరం పాటు గ్రామానికి చెందిన జంగారెడ్డి వద్ద కూలి పనులు చేసినప్పటికీ చివరి నెల కూలి ఇవ్వలేదని తెలిపారు.ఇతరుల వద్దకు కూలి పనికి వెళ్తున్నాడన్న కారణంతో అతనిపై దొంగతనం ఆరోపణలు మోపి,జంగారెడ్డి తనే కొట్టడమే కాకుండా ధారూర్ పోలీసులతో కూడా విచక్షణారహితంగా కొట్టించాడని ఆరోపించారు.చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులు మానవత్వం మరిచి ఇలా ప్రవర్తించడం తగదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.అసలు నిందితులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాల్సింది పోయి, పెత్తందారుల ప్రభావానికి లోనై బాధితుడిపై దాడి చేయడం తీవ్రంగా ఖండించారు.గ్రామ పెత్తందారి జంగారెడ్డి మరియు ధారూర్ ఎస్ఐ పై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని,ఎస్ఐ ని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.బాధితుడికి న్యాయం చేయకపోతే రాష్ట్ర డీజీపీ,మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు సతీష్.సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ సహ కార్యదర్శి మల్లేష్.ఇతర నాయకులు.బాధితుడి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## మండుతున్న వేసవిలో అంబలి పంపిణీ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రోజురోజుకు ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో బాటసారులకు మరోసారి స్కై ఫౌండేషన్ ఆసరాగా నిలుస్తోంది. హైదరాబాద్ నగరంలో ఇబ్బందులు పడుతున్న ప్రయాణంలో ఉన్న బాటచారులు, వాహనదారులు, రోడ్లపై పని చేస్తున్న జిహెచ్ఎంసి కార్మికులకు అంబలి పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. అంబలి తాగి ఉపశమనం పొందిన సందర్భంగా స్కై ఫౌండేషన్‌కు వారు మనసారా కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ.పావని తదితరులు పాల్గొన్నారు.